క్లుప్తంగా

విద్యార్థిదశ నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ జితేంద్రబాబు

ఉక్కునగరం: బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ డి. జితేంద్రబాబు అన్నారు. డీపాల్ పాఠశాలలో బుధవారం స్టూడెంట్ కౌన్సిల్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు బహూకరించారు.బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. అదే విధంగా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం వల్ల సమాజంలో మంచి నాయకుడిగా ప్రజల మన్ననలు పొందవచ్చన్నారు. అంతకు ముందు ఫాదర్ అనీష్ మాథ్యూ కౌన్సిల్ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ షాజి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: రామచంద్రనగర్ 11కేవీ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 25న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఈపీడీసీఎల్ జోన్‌-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రనగర్ ఫీడర్ పరిధిలో వుడా కాలనీ ఫేజ్‌-2 అమరావతి పార్కు, రామచంద్రనగర్, గాంధీనగర్, గోపాల్‌రెడ్డినగర్, పోర్టు రోడ్డు ఏరియా, డంపింగ్ యార్డ్, భరత్‌నగర్, అవరావతినగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: విద్యుత్‌లైన్ల నిర్వహణలో భాగంగా ఈనెల 25న 86వ వార్డులోని పలుకాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆశాఖ ఆపరేషన్ జోన్ డీఈ బీకే నాయుడు తెలిపారు. ఆల్ ఇండియా రేడియో,శివాజీనగర్, అశోక్‌నగర్, శాతవాహననగర్, గౌరీనగర్, శివసాయినగర్ తదితర కాలనీలకు ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



వార్డులో పర్యటిస్తున్న అధికారులు, కార్పొరేటర్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో పాటు కార్పొరేటర్ జగన్ పర్యటించారు. నిర్వాసిత కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంచినీరు వృథా అవుతున్నట్లు గమనించారు. ప్రజలతో మమేకమై మంచినీరు వృథా కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మంచినీటి విభాగం డీఈ బి.శ్రీనివాసరావు, ఏఈ కేదారినాథ్, తిరుమలనగర్ వాసులు పరంధామయ్య, ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేసీఎల్ ఆదేశాలు పట్టించుకోరా..

అగనంపూడి: ప్రమాదవశాత్తు మృతి చెందిన ఉక్కు కార్మికుడి కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలన్న జాయింట్ కమిషర్ ఆఫ్ లేబర్ (జేసీఎల్) ఆదేశాలను ఉక్కు యాజమాన్యం బేఖాతరు చేస్తుందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య లక్ష్మితో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. అగనంపూడి ఆర్‌హెచ్‌సీ పినమడకకు చెందిన ఎస్.అచ్యుతరావు 2016లో ప్రమాదవశాత్తు మృతిచెందితే యాజమాన్యం పరిహారం చెల్లించేందుకు విముఖత వ్యక్తం చేసిందన్నారు. ఈ విషయాన్ని ఆధారాలతో జేసీఎల్‌కు ఫిర్యాదు చేయడంతో పరిశీలించిన జేసీఎల్ 40 రోజుల కిందట పరిహారం పక్షం రోజుల్లో చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా 50శాతం చెల్లించాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేశారన్నారు. 40 రోజులు దాటినా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. యాజమాన్యం వైఖరి వల్ల ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నామని మృతుని భార్య లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు.

జ్యోతి.. ఎల్లలు దాటిన ఖ్యాతి





ఇటీవల గుంటూరులో నాట్య మయూరి అవార్డు స్వీకరిస్తూ..

- కూచిపూడి నృత్యంలో రాణింపు
- ఎనిమిదో ఏటే రంగప్రవేశం
- జాతీయ వేదికలపై సత్తాచాటిన నంబాలజ్యోతి
- గాజువాక ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు

గాజువాక దరి వుడా కాలనీకి చెందిన నంబాల జ్యోతికి చిన్నప్పటి నుంచీ నాట్యమంటే ఇష్టం. తోటి విద్యార్థులు చేస్తున్న ప్రదర్శనలను చూసి ఎలాగైనా మంచి నృత్యకళాకారిణి కావాలని సంకల్పించింది. అయితే, ఆమెను ప్రోత్సహించడానికి అవసరమైన వనరులు లేవు. తండ్రి నర్సింగరావు ఉక్కులో ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లి రాజేశ్వరి అన్నీ తానై జ్యోతిని పెంచింది. బిడ్డ ఆసక్తి గమనించి ప్రోత్సహించింది. పాఠశాల స్థాయిలో నృత్య ప్రదర్శనలిచ్చిన జ్యోతి కళాశాల స్థాయికి వచ్చేసరికి అన్ని గమకాలు, నృత్య రీతులను ఔపోషణ పట్టింది.

ఒక్కో మెట్టూ ఎక్కుతూ

ఏయూలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా తొలిసారి నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రముఖుల ప్రశంసలు పొందింది. తర్వాత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు వేదికలపై తన నృత్య ప్రతిభతో రాణిస్తోంది. నకాళ్లకు గజ్జెలు కట్టి వేదికపై రాగ, తాళ, భావయుక్తంగా కుండ నృత్యం, బృంద నృత్యాలు, వెస్ట్రర్న్ డ్యాన్సులు చేస్తూ అందర్నీ ఆకట్టుకుంటోంది. గురువులు కొండేటి వెంకటేశ్వరరావు, కాజా సుబ్రమణ్యం వంటివారి ప్రోత్సాహంతో వివిధ వేదికలపై ప్రదర్శనలు ఇవ్వగలుగుతున్నానని జ్యోతి పేర్కొంది.

తోటి విద్యార్థులు చేస్తున్న ప్రదర్శనలు చూసి స్ఫూర్తి పొందింది. పాఠశాలలో చదువుకుంటున్నప్పుడే నృత్యంపై మక్కువ పెంచుకుంది. నృత్య కళాకారిణి కావాలని కలలు కనింది. నృత్యమే ఆశ, శ్వాసగా చేసుకొని ఒక్కో మెట్టు అధిరోహించింది. జ్యోతి తన ఎనిమిదో ఏట నుంచే కూచిపూడిలో మెళకువలు నేర్చుకుంది. నటనతో మెప్పించింది. నాట్యంతో మయూరంలా అలరించింది.నృత్యరంగంలో గాజువాకకు ఎంతో పేరు తీసుకొచ్చింది. అనుకొన్న రంగంలో ఖండాంతర ఖ్యాతి సాధించింది.

– గాజువాక



జ్యోతి సాధించిన అవార్డులు, బహుమతులు



నాటి కేంద్ర మంత్రి చిదంబరంతో జ్యోతి బృందం(ఫైల్)

ఇదీ ప్రతిభ

- **గుంటూరు జిల్లాలో కళానిలయం ఆధ్వర్యంలో ఈ ఏడాది మే 24 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన ఆలిండియా నవరస డ్యాన్స్** పోటీల్లో జ్యోతి మొదటి స్థానాన్ని సాధించింది. సోలో డ్యాన్స్‌లో నాట్య మయూరి అవార్డు, గ్రూప్ డ్యాన్స్‌లో రాజహంస ట్రోఫీని సొంతం చేసుకుంది.
- ఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ క్రీడల ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది. నాటి కేంద్ర మంత్రులు జైపాల్‌రెడ్డి, చిదంబరం నుంచి ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత హైదరాబాద్ శిల్పారామంలో ఫోక్ డ్యాన్స్ భంగిమలతో రంజింపజేసింది.
- న్యూఢిల్లీలో జరిగిన 7వ అంతర్జాతీయ డ్యాన్స్ పోటీల్లో పాల్గొని పతకం సాధించింది.
- గుంటూరులో శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో యువకళారత్న పురస్కారాన్ని అందుకుంది.



అవార్డుతో కళాకారిణి జ్యోతి

- 2015లో మలేషియాలో జరిగిన తెలుగు మహాసభల్లో కూచిపూడి నృత్యం ప్రదర్శించి ఆ దేశ ప్రధాని అబ్దుల్ రజా చేతులమీదుగా పురస్కారం అందుకుంది.
- సికింద్రాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ద్వారా కూచిపూడిలో సర్టిఫికేట్ కోర్సుతోపాటు డిప్లమో కూడా పూర్తి చేసింది.
- కూచిపూడిలో ఎంఏ, పీహెచ్‌డీ చేసి ప్రదర్శనలతో భారతీయ నృత్య గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలన్నదే తన ధ్యేయమని జ్యోతి ఈ సందర్భంగా తెలిపింది.

సౌత్ ఏసీపీ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు, సౌత్ ఏసీపీ

గాజువాక: సౌత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ఏసీపీ)గా పి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమండ్రిలో సీఐడీ డీఎస్పీగా పని చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు గాజువాక సీఐ పార్థసారథి, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు తదితరులు పుష్ప గుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈ ప్రాంతంలో పరిస్థితులపై ఏసీపీ వారిని అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడమే తన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు.

150 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85వ వార్డుల్లోని అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉక్కు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కోసం అగనంపూడిలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు విశేష స్పందన లభించింది. మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 150 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.బోసుబాబు, బి.భాస్కర్‌రాజు మాట్లాడుతూ మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఉచిత సేవలు అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ వి.సుభద్ర, డాక్టర్ కె.పాల్ మాట్లాడుతూ ప్రతీ ఏటా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గుదే సుశీలా గజేంద్రరావు, ఐ.రామునాయుడు, ఎస్.ఎం.రఫీ, బీహెచ్‌ఎస్‌ఎన్.రాజు, ఎం.విశ్వనాథం, బి.కాళిదాస్, నూకరాజు పాల్గొన్నారు.

విస్తృతంగా 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'



సమావేశంలో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వార్డుల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు కమిటీలను వేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని చెప్పారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, వార్డు అధ్యక్షులు ధర్మాల శ్రీను, సంద్రాన నూకరాజు, బోగాది సన్నీ, భూపతిరాజు శ్రీనివాసరాజు, మంత్రి శంకరనారాయణ, రావాడ శివ, మహాలక్ష్మినాయుడు, పూర్ణానంద శర్మ, కోమటి శ్రీను, బొడ్డ గోవింద్, పల్లా పెంటారావు, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి

స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాల వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారని.. ఉత్పత్తి ప్రభావం చూపుతుందని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద యాజమాన్యం వైఖరికి నిరసరగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికులతో కనీసం చర్చించకుండా విభాగాలు మార్చడం యాజమాన్యం ఏకపక్ష నిర్ణయానికి నిదర్శనమన్నారు. మూడు నెలల్లో సుమారు రూ. 200 కోట్లు లాభాలు వచ్చినా కార్మికులకు బకాయిలు జీతాలు చెల్లించకుండా మీనమీషాలు లెక్కిస్తుందన్నారు. హెచ్‌ఆర్ఏ చెల్లింపు, కరెంటు చార్జీలు తగ్గింపు వంటి సమస్యలపై నేటికీ చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌లోని ఒక్కో విభాగాన్ని ప్రైవేటు వారికి అప్పగించేందుకు అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.వి.కె. రాజు, తొడన్న, కె. గంగాధర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలు ఘోరం.. వ్యాధుల భయం



పూడికతో నిండిన గెడ్డ



గెడ్డలో సంచరిస్తున్న పందులు

పెదగంట్యాడ: మండలంలోని పలు ప్రాంతాల్లో గెడ్డలు, డ్రైనేజీల్లో చెత్తా చెదారం, వ్యర్థాలు పేరుకుపోయాయి. అసలే వర్షాకాలం.. ఆపై ఈగలు ముసిరి, పందులు చేరి చిందర చేస్తూ రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాష్‌నగర్ ఐటీఐ గేటు ఎదురుగా ఉన్న చిన్న గెడ్డ చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండిపోయింది. మురుగు నీరు పారకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ పూడికలు తీసి కొన్ని నెలలు గడిచిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతో చాలా ప్రాంతాల్లో పారిశుధ్య అధికారులు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. నెలలు తరబడి ఇలా చెత్త తొలగించకుండా వదిలేస్తే ఇక్కడ నివసిస్తున్న వందల కుటుంబాలు జబ్బుల బారిన పడినా పట్టదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా శానిటరీ అధికారులు స్పందించి గెడ్డలు, కాలవల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వార్డెన్‌ను నియమించాలని వినతి

అగనంపూడి: లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న వెనుకబడిన తరగతుల వసతి గృహానికి పూర్తి స్థాయి వార్డెన్‌ను నియమించాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ వార్డెన్‌గా పనిచేసిన వ్యక్తి రెండు మాసాల కిందట ఉద్యోగ విరమణ పొందడంతో ఆ ఖాళీని భర్తీ చేయకుండా వేరే వార్డెన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారని.. సదరు వార్డెన్ మూడు వసతి గృహాల పర్యవేక్షణ చేయలేకపోతున్నారని వివరించారు. వెంటనే వార్డెన్‌ను నియమించాలని ఆయన కోరారు.


చేసిన సేవలే కలకాలం నిలుస్తాయి



ఉపాధ్యాయులను సత్కరిసున్న హెచ్‌ఎం అప్పారావు

పెదగంట్యాడ: అంకితభావంతో బోధన చేసే ఉపాధ్యాయులు విద్యార్థుల మనస్సుల్లో కలకాలం నిలుస్తారని యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. అప్పారావు అన్నారు. యారాడ పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు ఆహ్వానం పలుకుతూ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా బోధన చేసే ఉపాధ్యాయులను విద్యార్థులు ఎన్నటికీ మరువలేరన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మోహన్‌రావు, సరోజ్‌కుమార్, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్, బాల వికాస్ ఫౌండేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: ఈ నెల 30న అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ మానవ అక్రమ రవాణాను అరికట్టండి అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం సీతమ్మధారలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా కూడా ఒకటని, దీని ద్వారా ఎంతోమంది అమాయకులు బలవుతున్నారన్నారు. వివిధ కారణాల వల్ల దేశంలోని ఆడ, మగపిల్లలు అక్రమ రవాణా చేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనాగరిగ చర్యకు వ్యతిరేకంగా ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం ద్వారా దీనిని అరికట్టవచ్చన్నారు.

కాలుష్యకారక గొడౌన్లు ఏర్పాటు చేయవద్దు

అఖిలపక్షాల ఆధ్వర్యంలో స్థానికుల నిరసన



గొడౌన్ ప్రతిపాదిత ప్రాంతంలో నిరసన తెలుపుతున్న నాయకులు

గాజువాక: మింది గ్రామం శివారులో పెట్రో ఉత్పత్తుల సంస్థ గొడౌన్లు ఏర్పాటు చేసుకోవడానికి విశాఖపట్నం పోర్టు స్థలం కేటాయించడంపై పరిసర గ్రామాలకు చెందిన నివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అఖిలపక్షాల ఆధ్వర్యంలో వారు ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యకారక గొడౌన్లను ఏర్పాటు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ మాట్లాడుతూ ప్రమాదకరమైన గొడన్ల ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శ్రావణి షిప్పింగ్ గొడౌన్ల పక్కన భారత పెట్రోలియం లిమిటెడ్ క్రూడ్ ఆయిల్‌తో పాటు ఇతర పెట్రోలియం ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు గొడౌన్ ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతారని పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాలను అందులోకి డంప్ చేయడం వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. వివిధ పరిశ్రమల కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. ఈ ప్రాంతాన్ని గ్రీన్‌బెల్టుగా అభివృద్ధి చూసి బొటానికల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. పెట్రో ఉత్పత్తుల నిల్వకు గొడౌన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో స్థానికుల ఆగ్రహాన్ని చూడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మింది, అక్కిరెడ్డిపాలెం, పంచవటి టౌన్‌షిప్ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అదనపు వసతులు



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ప్రయాణికులు సేదతీరడానికి నిర్మిస్తున్న షెల్టర్



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేసిన కుళాయిలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పలు వసతులు కల్పిస్తున్నారు. ఈ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు రహదారి విస్తరించడం, బస్టాండ్, ఆటో స్టాండ్‌లకు స్థలాలు కేటాయించి ప్లాట్‌ఫారంలు నిర్మించారు. గతంలో ఈ ప్లాట్‌ఫారంపై ఒక షెడ్ ఉండేది. దీంతో ప్రయాణికులు ఎండకు, వానకు ఇబ్బందులు పడేవారు. పరిస్థితిని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పునరాభివృద్ధి పనుల్లో భాగంగా వీటిని నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో నాలుగో ప్లాట్‌ఫారం మీద ఉన్న కడప శ్లాబ్, నీటి కుళాయిలు తొలగించారు. వాటి స్థానంలో స్టీల్ స్టాండ్‌లు, కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజారోగ్య విభాగం ఆకస్మిక తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం జీవీఎంసీ ప్రజారోగ్య విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జీవీఎంసీ అన్ని విభాగాల ఉద్యోగులు నిర్దీత సమయానికే విధుల్లో ఉండాలని ఆదేశించారు. స్టాటస్టికల్ ఆఫీసర్ పీవీడీ ప్రసాదరావు చాంబర్‌లో బర్త్ అండ్ డెత్ వివరాలు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని హాస్పిటల్స్ నమోదై ఉన్నాయో ఆరా తీశారు. 238 హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ అయ్యాయని స్టాటస్టికల్ ఆఫీసర్ తెలిపారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు ప్రస్తుతం ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అర్జీల మేరకు వెంటనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీలో రిజిస్ట్రేషన్ కాని బర్త్ అండ్ డెత్ నమోదులు జరిగే క్లినిక్‌లు, ఆస్పత్రులు ఏమైనా ఉంటే సీఆర్‌ఎస్ పోర్టల్ ద్వారా నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం వహించరాదని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు.